


# అపార్థం

కుమారి కుంతల

డియర్ సూర్యారావ్!

నామీద నీకున్న కోపం కొద్దీ ఈ ఉత్తరాన్ని చించి వేయవద్దు. దయతో ఆసాంతం చదువు. ఈ ఉత్తరాన్ని ఓ కథతో ప్రారంభిస్తున్నాను. కథంటే కథ కాదు...నువ్ నమ్మగలిగితే నిజమే అది—

ఊఁ...చదువుతున్నావ్ కదూ?

★ ★ ★ ★

సూర్యారావు, ముద్దుకృష్ణ ఆరునెలల క్రిందట వరకు రాసుకుపూసుకు తిరుగుతూ ఉండేవారు. చూపరులకు స్నేహమంటే ఇలా వుండాలనిపించేలా ఎప్పుడు చూసినా చెట్టాపట్టాలేసుకునే కన్పిస్తూ ఉండేవారు. చిన్నచిన్న విషయాల్లో ఒకరికొకరు సహాయం చేసుకుంటూ...కాఫీ హొటళ్ళకీ, సినిమాలకీ కలసి వెళ్తూ...అరమరిక లెరుగని అపూర్వ స్నేహితుల్లా ఉండేవారు.

అలాంటిది ఇప్పుడు సూర్యారావు పేరుచెబితేనే మండిపడ్తున్నాడు ముద్దుకృష్ణ. ముద్దుకృష్ణ ఊసెత్తితే చాలు ఉగ్రుడవుతున్నాడు సూర్యారావు.

కారణం లేకుండా కలహం తలెత్తదు!

ఉంది...వారిద్దరూ యిలా ఎడముఖం పెడముఖంగా తయారవడానికి ఓ కారణముంది!

ఆరునెలల క్రితం...

ఒకరోజు— "ఓ యాభై ఉంటే సర్దుగురూ! మళ్ళీ ఫస్టుకి తీసుకుందువుగాని" అని అడిగాడు సూర్యారావు ముద్దుకృష్ణని.

అవసరాలను బట్టి అలా ఒకరినుంచొకరు చేబదుళ్ళు తీసుకోవటం వారికి కొత్తకాదు. తరచుగా జరిగే వ్యవహారమే.

"సారీ గురూ! పొద్దున్న ఓ హండ్రెడ్డుంటే మీ సిస్టర్ తీసేసుకుంది. వండక్కి ఏ చీరైనా డెబ్బయ్యయిదే బావతు కొట్టేదే వెలిసిందిగా...'నా చేతిఖర్చులక్కూడా లేవేబాబూ' అన్నా విన్పించుకోకుండా డబాయించి లాగేసుకుంది—" అంటూ తన అశక్తతని వెల్లడించాడు ముద్దుకృష్ణ.

అలాగా అన్నట్లు తల వంకించిన సూర్యారావు "ఇలా ఏ చీరయినా ఇంతకే అని అమ్మేవాళ్ళని షూట్ చేసి పారేయ్యాలి!" అన్నాడు నడన్‌గా.

ముద్దుకృష్ణ ఆశ్చర్యంగా చూశాడు.

"అయితే నీ అవసరం కూడా అదేనన్నమాట!"

"అవును. నిన్నటి నుంచి ఒకటే పోరు .... ఊపిరి తిప్పుకోనివ్వడం లేదనుకో .... నా దగ్గర యాభై ఉన్నాయ్, పోనీ యాభయ్యైనా యివ్వండంటూ ఒకటే గోల" అన్నాడు సూర్యారావ్.

"ఈ ఆడాళ్ళతో ఇదే ట్రబుల్! వాళ్ళకి తెలియదు. ఒకళ్ళు చెప్తే వినిపించుకోరు. ఆ డెబ్బయయిదు రూపాయల చీరలు ఉండేనా చచ్చేనా ... ఒక్కూతుక్కే క్లోజ్" అంటూ జేబులోంచి సిగిరెట్ పెట్టెని బైటకి తీశాడు ముద్దుకృష్ణ.

ఆ క్షణంలో అతనలా ... ఆ సిగిరెట్ పెట్టెని బైటికి తీసుండకపోతే అసలే గొడవా ఉండేది కాదు!

అవును—

ఎందుకంటే - ముద్దుకృష్ణ ఆ సిగిరెట్ పెట్టెని బైటికి తీయడం వల్లే దాన్తోపాటు రాలి క్రింద పడ్డాయి రెండు వందరూపాయల నోట్లు!!

అంతే ... సూర్యారావు ముఖం పెంకులా మాడి పోయింది.

"అరెఁ... ఇవెక్కడివి?" అంటూ ఒంగి నేలమీద పడ్డ ఆ వంద కాగితాల్ని ఆశ్చర్యంగా అందుకున్నాడు ముద్దుకృష్ణ.

ముద్దుకృష్ణని ముఖం పగిలేలా కొట్టాలని పించింది సూర్యారావ్‌కి. "పావం నీచేతి ఖర్చుక్కూడా డబ్బుల్లేవని వాపోతున్నావ్‌గా ... అందుకని ఆ భగవంతుడు నీకు తెలియకుండానే వాటిని నీ జేబులో పెట్టేనుంటాడు" అన్నాడు వ్యంగ్యంగా.

సూర్యారావు తనని అపార్థం చేసుకున్నాడని తెలిసి పోయింది ముద్దుకృష్ణకి. ఆ రెండు నోట్లూ తన జేబులో కెలా వచ్చాయో పాపమాక్షణంలో నిజంగానే అతనికి తెలియదు!

"నిజం... గురూ....ఇవి నా జేబులో ఉన్నట్లు నాకు తెలియదు. అసలెలా వచ్చాయో కూడా తెలియదు.... డోంట్ మిసండర్‌స్టాండ్‌మీ..." అన్నాడు ముఖం పాలిపోగా.

సూర్యారావు చీదరింపుగా చూసి - "కలికాలం కదా! ఈ రోజుల్లో ఏం జరిగినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. బహుశా నీ జేబు ఈ మధ్య కరెన్సీని కంటున్నదేమో" అన్నాడు మరింత వ్యంగ్యంగా.

"ఒట్టు గురూ ..." అంటూ ఏదో చెప్పబోయాడు ముద్దుకృష్ణ.

"డోంట్ టెల్ మి కాక్ అండ్ బుల్ స్టోరీస్" అంటూ అడ్డు పడ్డాడు సూర్యారావు. "ఇన్నాళ్ళు నువ్వెంతో మంచి స్నేహితుడివనుకున్నాను. ఛీ...నీలో యింత మనీమైండెడ్‌నెస్ ఉంటుందనుకోలేదు. అయినా నేనడిగింది అప్పేగా? నా దగ్గర నువ్వు, నీ దగ్గర నేనూ ఎన్నిసార్లు తీసుకోలేదు. ఎన్నిసార్లు ఇచ్చేసుకోలేదు. నీ దగ్గర అప్పు తీసుకుని ఎప్పుడైనా ఎగ్గొట్టానా? మన స్నేహాన్ని కూడా లెక్క చెయ్యకుండా ఓ యాభైరూపాయల దగ్గర... ఆఫ్టరాల్ ఫిఫ్టీ రుపీస్ దగ్గర మొహం చూసుకున్నావ్....సరేలే ఎందు కొచ్చిందో కానియ్.... నల్లవన్నీ నీళ్ళు, తెల్లవన్నీ పాలూ

కావని ఎందుకంటారో నాకిప్పుడే తెలిసింది!

"ఇన్నాళ్ళు నీతో స్నేహంగా ఉన్నందుకు సిగ్గుప డ్తున్నాను. నీకూ నీ స్నేహానికి గుడ్‌బై... వస్తా" అంటూ ముద్దుకృష్ణకి నోరు విప్పేందుకు కూడా అవకాశం ఇవ్వకుండా విసురుగా వెళ్ళిపోయాడు అక్కడి నుంచి—

ఈ హఠాత్సంఘటనకి బ్రాన్పడిపోయాడు ముద్దు కృష్ణ.

ఇంటికెళ్ళి భార్యను వాకబు చేశాక గాని తెలియ లేదు అతనికసలు సంగతి.

"నా జేబులో రెండొందలెక్కడివే...నువ్ గాని పెట్టావా?" అనడిగాడు భార్యని ఇంట్లో కాలు పెట్టీపెట్టగానే!

"అవునండి... మీకు చెప్పడం మర్చిపోయాను. పొద్దున్న మీ దగ్గర వందడిగి తీసుకున్నానా? తర్వాత మీరు స్నానానికి వెళ్ళారు కదా అప్పుడు పక్కింటి సుందరమ్మ పిన్నిగారొచ్చి రెండొందలిచ్చారు. ఆ మధ్య వాళ్ళ అబ్బాయి ఫీజు కంటూ మన దగ్గర అప్పడిగి తీసుకున్నారూ అదీ. నేనా రెండొందలు మీ జేబులో పెట్టాను గానీ చెప్పడం మర్చిపోయాను.. ..ఎక్కడివబ్బా అనాశ్చర్యపోయారా?" అందామె నవ్వుతూ.

"ఆశ్చర్యపోవడం కాదు...ఏకంగా కొంప మునిగింది" అంటూ విషయం వివరంగా చెప్పాడామెకు.

"సూర్యారావన్నయ్యగారు అంత తొందరగా మిమ్మల్నిలా అపార్థం చేసుకున్నారండీ? సరే రేపో మాపో మనింటికి రాకపోరుగా...అప్పుడు నేనే చెబుతాలెండి" అన్నదామె.

మర్నాడు ముద్దుకృష్ణ సూర్యారావును కలిసి, ఇలాగిలాగ జరిగింది గురూ! కాని నువ్వేమో నన్న పార్థం చేసుకున్నావంటూ అతనికి విషయం బోధ పరిచాడు.

"ఓహెూ అలాగా.... అహఁ - అలాగా..." అంటూ వినటం శ్రద్ధగానే విన్న సూర్యారావు చివర్లో మాత్రం చటుక్కున తీసేశాడు ముద్దుకృష్ణ గాలి "బావుంది చాలా బావుంది నువ్వినిపించిన కథంటూ"

ముద్దుకృష్ణ ముఖం చిన్నబుచ్చుకుని "ఇంత చెప్పినా కూడా నువ్వింకా నన్ను నమ్మలేకపోతున్నావా?" అన్నాడు బాధగా.

"నమ్మేవాణ్ణే గాని నా చెవిలో పువ్వు లేదుగా మరి?" అని వెటకారంగా అనేసి - "కట్టు కథల్తో విరిగిన మనసులు అతుక్కోవు ముద్దుకృష్ణా. ఇంకెప్పుడూ యిలాంటి వృథా ప్రయత్నాలు చెయ్యొద్దు..." అంటూ బూటు కాలితో నేలని దఢాలున తన్ని విసవిసా వెళ్ళిపోయాడు సూర్యారావు.

ఆ బూటుకాలి తన్ను తన ముఖం మీదే తగిలినట్లుగా అనిపించింది ముద్దుకృష్ణకి.

అంతే!

అతని మనసూ విరిగింది పుట్టుక్కున.

ఆ దెబ్బతో వారిద్దరూ బద్ధ శత్రువులై పోవడమే కాదు - సదరు శత్రుత్వం వారి భార్యల వరకూ విస్తరించి - ఆరెండిళ్ళ మధ్యా రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి.

• • •

చదివావా సూర్యారావ్?

జరిగింది అది!

ఎంతో కాలం నుండి ఎంతో స్నేహంగా ఉన్న మనం ఒక చిన్న విషయం దగ్గర - అదైనా అపార్థాలకు లోనై ఇలా విడిపోవడం - ఈ ఆరునెలల నుండీ కూడా నన్నెంతగానో బాధిస్తోంది.

నీతో మళ్ళీ మాట కలపాలని మొదట్లో నేనెన్నోసార్లు ప్రయత్నించాను. కాని ఏనాడూ నువ్వు నాకా అవకాశాన్నివ్వ లేదు. దాంతో నాకూ మనస్సు చివుక్కు మనిపించి నేనూ అలాంటి ప్రయత్నాలు చెయ్యటం మానేశాను. కాని ఎంత సరి పెట్టుకోవాలన్న నా మనస్సు నన్ను అనుక్షణం వేధిస్తూనే వుంది ఈ విషయంలో.

మనం ఒక కంచంలో తిని ఒక మంచంలో పడుకోకపోయినా కొన్ని సంవత్సరాల పాటు మంచి స్నేహితుల్లా మసలుకున్నాం.

అట్లాంటిది...ఒక చిన్న అపార్థం మనల్ని వేరు చేసింది. బ్యాడ్‌లక్ అని సరిపెట్టుకోవచ్చు సరిపెట్టు కోవాలనుకుంటే, కాని పరిస్థితిని తిరిగి చక్కదిద్దుకోవడానికి ప్రయత్నించడంలోనే ఔచిత్యం ఉందనిపిస్తోంది నాకు.

అందుకే ఈ ప్రయత్నం.

కట్టుకథలతో విరిగిన మనసులు అతుక్కోవు అన్నావు నువ్వేనాడు. కాని - ఇది కట్టుకథ కాదు. జరిగిన కథ ఆలోచించు సూర్యారావ్ ఆలోచించు. మన స్నేహం మళ్ళీ నిలబడాలని నేను మనసారా ఆకాంక్షిస్తున్నాను. అంతిమ నిర్ణయం నీకే వదిలేస్తున్నాను.

ఇట్లు
నీ స్నేహితుడు(?)
ముద్దుకృష్ణ

ఉత్తరం చదవటం ముగించిన సూర్యారావ్ తన జేబులోంచి కలాన్ని బైటికి తీసి 'నీ స్నేహితుడు' ప్రక్కన బ్రాకెట్‌లో వున్న క్వశ్చన్‌మార్క్‌పై ఇంటూ గుర్తు పెట్టాడు.

□



everest/91/SH/2 tl